సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం, 6, మార్చి, 2023



వెంకన్నకు నీరాజనం

ఉపమాక వెంకన్నను దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది.

8లో



రేపే అప్పన్నకు పెళ్లిచూపులు

సింహాచలం అప్పన్న స్వామికి పెళ్లి చూపులు జరగనున్నాయి. మెట్ల మార్గం గుండా కొండ దిగువకు విచ్చేయనున్నారు.

8లో

పొంచి ఉన్న ప్రమాదం



హుకుంపేట మండలంలో తీగలవలస పంచాయతీ పరిధిలోని ఓలుబెడ్డా, పనసబంద, కిన్నే ర్లోవా, గుర్రాలతోట గ్రామాల్లో ఐరన్ విద్యుత్ స్తంభాలు తుప్పపట్టి ప్రమాదకరంగా మారాయి.

న్యూస్‌రీల్

దళారులను నమ్మి మోసపోవద్దు



కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: మిరియం రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిరియాలకు మార్కెట్లో మంచి ధర ఉందన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన రైతులంతా కిలో ధర రూ.500కు తక్కువ లేకుండా విక్రయించాలని సూచించారు. గతేడాది కిలో రూ.400కు అమ్ముకుని నష్టపోయిన రైతులు ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులను అంచనా వేసి విక్రయించడం ద్వారా ఉపశమనం పొందవచ్చునని సూచించారు.

మోదమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి ప్రసాదాలు అందజేశారు.

మూడు రోజులపాటు పాడేరులో అరకు ఎంపీ

సాక్షి,పాడేరు: అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి సోమవారం నుంచి మూడు రోజుల పాటు పాడేరులోనే అందుబాటులో ఉంటారని ఎంపీ క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు. పాడేరులోని సినిమాహాల్ వెనుక లోచలిపుట్టులోని క్యాంపు కార్యాలయంలో ఆమె అందుబాటులో ఉంటారన్నారు. అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,వైఎస్సార్‌సీపీ నేతలు,అన్ని వర్గాల ప్రజలు ఎంపీని కలిసి తమ సమస్యలు విన్నవించుకోవచ్చునని వారు పేర్కొన్నారు.

అనారోగ్యంతో శిశువు మృతి



శిశువు మృతదేహం

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుం పంచాయతీ శిరసుగుడ గ్రామానికి చెందిన కొర్రా సుమిత్ర, సుందరరావు దంపతుల నాలుగు నెలల శిశువు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. వైద్య సిబ్బంది సక్రమంగా గ్రామాల్లో సందర్శించకపోవడం వల్ల అవసరమైన వైద్యం అందక మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వెళ్లే మార్గంలో ఆదివారం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు పర్యాటకులకు స్వల్ప గాయాలయ్యాయి. పర్యాటకులతో బొర్రా బయలుదేరిన ఆటో బలియగుడ సమీపంలోని మలుపువద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ఘటనలో నలుగురు పర్యాటకులకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరు విశాఖ ప్రాంతానికి చెందిన వారుగా తెలిసింది.

112 కిలోల గంజాయి స్వాధీనం

చోడవరం రూరల్: రెండు ఆటోల్లో తరలిస్తున్న 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం చోడవరం సమీపంలోని చుక్కావారి కళ్లాల వద్ద ముందుగా మోటార్‌సైకిల్‌పై ఒకరు పైలట్‌గా వెళ్తూ, వెనుక రెండు ఆటోల్లో గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన కొర్రా చిన్నారావు, కొర్రా లక్ష్మణ్, వంతాల శివన్న, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజఫర్ నగర్‌కు చెందిన ఉస్మాన్, అదే ప్రాంతానికి చెందిన బాబులు అనే నిందితులను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి గంజాయి, రెండు ఆటోలతోపాటు మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అప్పలనాయుడు చెప్పారు.

గిరి రైతుకు భరోసా

- ఈఏడాది 90 శాతం రాయితీపై విత్తనాల సరఫరా
- 18,207 క్వింటాళ్ల వరి, 4,553 క్వింటాళ్ల రాజ్‌మా పంపిణీకి ఆమోదం
- ముందస్తుగా అందజేతకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు



రాజ్‌మా విత్తనాలు (ఫైల్)

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది కూడా ఖరీఫ్‌లో గిరి రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా చేయనుంది. జిల్లాలో 60 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి విత్తనాల నిమిత్తం జిల్లా వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించడంతో 18,207 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు చేసింది. ఏప్రిల్ నెలాఖరు, మే మొదటి వారంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ తెలిపింది. గత మూడేళ్లుగా 90 శాతం రాయితీపై అందిస్తూ గిరి రైతుకు భరోసా కల్పిస్తోంది.

మండలాల వారీగా..

వై.రామవరంలో 481 క్వింటాళ్లు, గంగవరం 1150, రాజవొమ్మంగి 1200, అడ్డతీగల 150, ఎటపాక 440, వీఆర్‌పురం 920, చింతూరు 1876, కూనవరం 850, రంపచోడవరం 950, మారేడుమిల్లి 162, దేవీపట్నం 713, చింతపల్లి 1040, జీకేవీధి 1013, కొయ్యూరు 1150, పెదబయలు 708, జి.మాడుగుల 400, ముంచంగిపుట్టు 800, పాడేరు 540, అరకులోయ 1000, అనంతగిరి 610, హుకుంపేట 630, డుంబ్రిగుడ మండలానికి 424 క్వింటాళ్ల విత్తనాలను వ్యవసాయశాఖ కేటాయించింది.

ముందస్తుగానే రాజ్‌మా..

రాష్ట్ర ప్రభుత్వం పాడేరు డివిజన్‌కు సంబంధించి రాజ్‌మా విత్తనాలను కూడా ముందస్తుగానే పంపిణీకి తగిన చర్యలు తీసుకుంది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో మాత్రమే సాగయ్యే రాజ్‌మాకు సంబంధించి గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీపై 4,440 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేసింది. ఈ ఏడాది కూడా 4,553 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను 90 శాతం రాయితీపై సరఫరాకు ఆమోదం తెలిపింది. చింతపల్లి మండలానికి 708 క్వింటాళ్లు, జీకే వీధికి1000, కొయ్యూరుకు 103, పెదబయలుకు 300, జి.మాడుగులకు 358, ముంచంగిపుట్టుకు 319, పాడేరుకు 400, అరకులోయకు 450, అనంతగిరికి 275, హుకుంపేటకు 300, డుంబ్రిగుడకు 340 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించింది. జూలై నాటికి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గిరి రైతులకు ఎంతో మేలు



విత్తనాలను 90 శాతం రాయితీపై మంజూరు చేయడం వల్ల గిరి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించడంతో వరి, రాజ్‌మా విత్తనాలు ముందస్తుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుబాటులోకి తెస్తాం.

-ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఆర్థిక ప్రగతి లక్ష్యం కావాలి

చైతన్య స్రవంతి సంస్థ డైరెక్టర్ మాలిని



మహిళలకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న మాలిని, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని గిరిజన మహిళలంతా ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా నిర్మించుకుని స్వయం సమృద్ధి సాధించాలని చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మాలిని కోరారు.పంచాయతీ కేంద్రమైన మినుములూరులోని చైతన్య స్రవంతి ప్రధాన కార్యాలయంలో ముందస్తుగా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ పథకంలో కుట్టు శిక్షణ,గార్మెంట్ మేకింగ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్టు ఆమె తెలిపారు. శిక్షణ పొందిన గిరిజన మహిళలకు ధ్రువపత్రాలను సర్పంచ్ లంకెల చిట్టమ్మ, మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ ప్రతినిధులు కె.ఎల్.ఎస్.రెడ్డి,అప్పికొండ,ఆర్క్ సంస్థ వ్యవస్థాపకులు ప్రసాద్ పంపిణీ చేశారు. శిక్షణ పొందిన వారంతా తోటి గిరిజన మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు.ఈకార్యక్రమంలో మాతోట మాక్స్ సీఈవో లోచలి ధనుంజయ్, చైతన్య స్రవంతి ప్రతినిధి రాజ్‌కుమార్ ,వార్డు సభ్యులు, మినుములూరు గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం



వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజాంబ కొండపై ఉన్న ఉత్సవ విగ్రహాలను వడ్డాది వీధుల్లో ఊరేగించారు. గజ,గరుడ వాహనాలపైన, ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు,డప్పు వాయిద్యాల నడుమ తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు.వేలాది మంది భక్తులు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. ఊరేగింపు రథం లాగడానికి పలువురు పోటీపడ్డారు. ఆదివారం సెలవు రోజుకావడంతో దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువన,ఆలయం వెనుక భక్తులకు ఉదయం టిఫిన్,మధ్యాహ్నం,రాత్రికి ఉచిత భోజన వసతి కల్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వీఆర్వో మృతికి సంతాపం

పెదబయలు: మండలంలోని పర్రెడ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్–2 వీఆర్వో బొండా రాధాకృష్ణ (32) అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన రోగుల గ్రామంలో నివసిస్తున్నారు. కొంతకాలంగా ఆయన టీబీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వచ్చకామెర్లతో పరిస్థితి విషమంగా మారడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు వివరించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. సర్పంచ్ మాధవరావు, వీఆర్వో సత్యారావు, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వీఆర్వో రాధాకృష్ణ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పేద విద్యార్థులకు వరం

- ప్రైవేట్ స్కూళ్లలో 25% సీట్లు
- నేటి నుంచి పాఠశాలలు రిజిస్ట్రేషన్
- సీఎస్ఈ వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలు
- 18 నుంచి దరఖాస్తుకు అవకాశం
- లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు
- అమ్మ ఒడి పథకం కింద ఫీజు చెల్లింపు



విశాఖ విద్య: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచితంగానే చదువుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. నచ్చిన పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం పొందవచ్చు. సీటు పొందిన విద్యార్థుల ఫీజును అమ్మ ఒడి పథకం కింద ప్రభుత్వం చెల్లించనుంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. సోమవారం నుంచి జిల్లాలో గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు సీఎస్ఈ వెబ్‌సైట్‌లో తమ వివరాలను అందుబాటులో ఉంచాలి. ప్రవేశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు http://cse.ap.gov.in/ అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు. 2022–23లో జిల్లాలో 114 మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు దృష్టి సారించారు.

ఇదీ షెడ్యూల్

- సోమవారం నుంచి ఈ నెల 16 వరకు గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు వెబ్‌సైట్‌లో వివరాలను అందుబాటులో ఉంచాలి.
- ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకు దరఖాస్తు చేసుకోవాలి
- ఏప్రిల్ 9 నుంచి 12 వరకు అర్హులైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 13న మొదటి రౌండ్ జాబితాను లాటరీ పద్ధతిన ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 15 నుంచి 21 వరకు సీటు పొందిన విద్యార్థులు పాఠశాలల్లో చేరాలి.
- ఏప్రిల్ 25న రెండో విడత సీటు పొందిన వారి వివరాలు ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 26 నుంచి 30 వరకు విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు అవకాశం ఉంది.

తల్లిదండ్రులకు అండగా టోల్ ఫ్రీ నంబర్

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అర్హులైన పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచిత సీట్లు పొందే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే, సకాలంలో పరిష్కరించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 14417 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వచ్చిన గ్రీవెన్స్‌లను సత్వర పరిష్కారం కోసం ఎంఈవో, డీఈవో స్థాయిలో ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తున్నారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల అన్నింటిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో తప్పనిసరిగా 25 సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించాలి. ఇందులో అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం, ఎస్సీ–10 శాతం, ఎస్టీ–4 శాతం, ఇతర వర్గాలకు –6 శాతం సీట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, అర్బన్‌లో అయితే రూ.1.44 లక్షలు మించకుండా ఉన్న వారే అర్హులు.

ఫీజు చెల్లింపు ఇలా..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో సీటు పొందిన విద్యార్థులు ఏడాదికి ఎంత ఫీజు చెల్లించాలనేది ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. అర్బన్‌లో రూ.8 వేలు, రూరల్‌లో రూ.6,500లు, గిరిజన/షెడ్యూల్ ప్రాంతాల్లో రూ.5.100. వీటిని అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పేద విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో చదువుకోవాలనే కోరిక ఈ కార్యక్రమం ద్వారా నెరవేరుతుంది. ఈ సారి ఎక్కువ మందికి లబ్ధిచేకూర్చేలా దృష్టిసారించాం. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

25 శాతం సీట్లు ఇవ్వాల్సిందే..



పేద విద్యార్థులకు ఇదో వరం అనే చెప్పాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతో దీన్ని అమలకు సిద్ధమయ్యారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలి. విద్యాశాఖాధికారులు కూడా దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కమిషన్ దృష్టికి తీసుకురావచ్చు.

– డాక్టర్ సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు

సీతంరాజు సుధాకర్ విజయం తథ్యం

అరకు ఎంపీ మాధవి



ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్ విజయం తథ్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థిసుధాకర్ ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షురాలు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ,పార్టీ నేతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పాడేరు, అరకు నియోజకవర్గాల్లోని పట్టభద్రులంతా సుధాకర్‌కే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పార్టీ అధిష్టానం బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకునే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అన్ని గ్రామాలలోను పట్టభద్రులను కలిసి విస్తృత ప్రచారం చేయాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, పాడేరు మండల పార్టీ అధ్యక్షుడు సీదరి మంగ్లన్నదొర, మాజీ సర్పంచ్ మినుముల కన్నాపాత్రుడు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు కొట్టగుళ్లి కొండాజీ, సోషల్ మీడియా ప్రతినిధి అల్లాడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు.మండలంలోని కావరంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు సూచించిన వారికే సంక్షేమ పథకాలు అందేవని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ తోనే ప్రజలకు మేలు జరుగుందన్నారు. ఈ విషయాన్ని ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్హత ఉండి పథకాల అందని వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మంజూరుకు కృషి చేయాలని ఆమె కోరారు. ఎంపీపీ పాయం రంగమ్మ, మేరుకులం, కార్పొరేషన్ డైరెక్టర్లు డి. గంగాధర్, ఏ వెంకటరామారావు, ఇంటిపూర్ణానందం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, యూత్ కన్వీనర్ సోందె పాపారావు, ఎంపీటీసీ గారపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సోందె ముత్తమ్మ, సున్నం అభిరాం, టీ నిరోషా, కె. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు గోశాల పశువులు

- 150 సరఫరాకు చర్యలు
- ఎస్పీ సతీష్‌కుమార్



పాడేరు రూరల్: గతంలో పిడుగుపాటుకు గురై పశువులను నష్టపోయిన బాధిత గిరిజన రైతులకు పాడి పశువులను అందజేస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది పాడేరు ఐటీడీఏ పరిధిలోని పెదబయలు మండలం ఇంజరి, జముడం, వనుకొత్తూరు, చింతలవీధి తదితర గ్రామాల్లో పశువుల మందపై అకాల వర్షాలకు పిడుగులు పడటంతో అధిక సంఖ్యలో మృత్యువాత పడ్డాయన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు బాధిత రైతులకు పశువులు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సింహాచలం గోశాలకు చెందిన 150 పశువులను రైతులకు అందజేస్తున్నామని ఆయన వివరించారు. వీటికి రెండు నెలల పాటు దాణా కూడా రైతులకు ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. బాధిత రైతులను వారి స్వగ్రామాల నుంచి ప్రత్యేక బస్సుల్లో విశాఖ తీసుకువెళ్లి అక్కడ పశువులు అందజేస్తామన్నారు. అక్కడి నుంచి స్వగ్రామాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేస్తామని ఆయన వివరించారు. పశువుల పంపిణీకి పశుసంవర్ధక శాఖ ఏడీ రవికుమార్ విశేష కృషి చేశారని తెలిపారు. పాడేరు సీఐ సుధాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావు

చింతూరు: మండల కేంద్రంలోని ఆరోగ్యమిత్రలకు ఆరోగ్య భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రథమ చికిత్స, జీవనశైలి, గృహవైద్యం అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏలూరులోని అల్లూరి సీతారామరాజు వైద్య కళాశాల ప్రొఫెసర్, ఆరోగ్యభారతి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్య వ్యక్తి, కుటుంబం, గ్రామం అనే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తోందన్నారు. మహిళలు, పురుషుల్లో వచ్చే వ్యాధులను గుర్తించి వారికి సకాలంలో చికిత్స అందిస్తే మంచి ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 45 మంది ఆరోగ్యమిత్రలకు మెడికల్ కిట్లు, 75 మంది కేజీబీవీ విద్యార్థినులకు బాలరక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దీన్‌దయాళ్ ఆస్పత్రి, మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, చింతూరు సేవా భారతి డాక్టర్లు ఎ.వి.ఎల్.నారాయణ, విజయలక్ష్మి, గంగాధర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ భేష్

తమిళనాడు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రశంస



మాట్లాడుతున్న సంతిల్ కుమార్

గాజువాక : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ అద్భుతంగా ఉందని తమిళనాడు రాష్ట్ర హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంతిల్ కుమార్ ప్రశంసించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన గాజువాక పీహెచ్‌సీని ఆదివారం సందర్శించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఫార్మసీ స్టోర్స్, ల్యాబ్ టెస్టులు, ఆప్తమాలజీ, ఇన్‌పేషెంట్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, వివిధ రిపోర్టులతోపాటు రోగులకు అందిస్తున్న సేవలను ఆన్‌లైన్, యాప్‌లలో నమోదు చేస్తున్న విధానాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్యులే రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందించే విధంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ బాగుందన్నారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను అభినందించారు. గర్భిణీ నుంచి డెలివరీ అయిన తరువాత పిల్లల ఇమ్యూనైజేషన్ వరకు అందుతున్న సేవలు ఆంధ్రప్రదేశ్‌లో బాగా జరుగుతున్నాయన్నారు. ఈ సంజీవిని కాల్స్ స్పెషలిస్ట్ సేవలు, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ పక్కాగా అమలవుతుందన్నారు. ఆయనతోపాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు, అదనపు డీఎం అండ్ హెచ్‌వో పూర్ణేంద్రబాబు, మహిళా వైద్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, సీహెచ్‌వో పి.నాగఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ పీవో విజయలక్ష్మికి సత్కారం



విజయలక్ష్మిని సత్కరిస్తున్న జ్ఞానానంద ఆశ్రమ ప్రతినిధులు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో విజయలక్ష్మి ఉత్తమ యోగా ఉపాధ్యాయిని పురస్కారం అందుకున్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట జ్ఞానానంద ఆశ్రమ పీఠాధిపతి యోగానందభారతి ఆధ్వర్యంలో ఆశ్రమ ప్రతినిధులంతా ఆదివారం విజయలక్ష్మిని సత్కరించి ఉత్తమ యోగా ఉపాధ్యాయిని ప్రశంసపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్‌నాయక్, సీహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండు పశువుల పాకలు, వరి కుప్పలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కె.కోటపాడు: పాడుగుపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మడల గోవింద, రమణల నివాస యోగ్యమైన పశువుల పాకల్లో ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ప్రయత్నించినా మంటలు అదుపు చేయలేకపోవడంతో చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. మంటల్లో రెండు పాకలతో పాటు రెండు వరికుప్పలు కాలిపోయాయి. బాధితులకు సుమారు రూ.లక్షా 50వేల ఆస్తి నష్టం కలిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఉపమాక వెంకన్నకు నీరాజనం

- దర్శనానికి పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు



స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు



అన్న దానంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కల్యాణోత్సవాల అనంతరం మూడోరోజు ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు అభిషేకాలు నిర్వహించారు. బాల భోగనివేదన రాజభోగనివేదన, అష్టదిక్పాలకులకు ఆవాహన,నాలాయిర సేవాకాలం, చిన్నపల్లకిలో తిరువీధి సేవలు తీర్థగోష్టి ప్రసాద వినియోగం నిర్వహించారు. స్వర్ణాభరణాలతో అలంకరించిన స్వామివారిని అద్దాలమహాల్‌లో ఉంచారు. కల్యాణశోభతో కాంతులీనుతున్న మలయప్పస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా స్వామి దర్శనానికి వెళ్లారు. కొండపై మూలవిరాట్‌ను, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని, స్వామివారి ఉత్సవ మూర్తులను దర్శించుకుని ఉపమాకలో జరుగుతున్న తిరునాళ్లను తిలకించి తిరుగు ప్రయాణమయ్యారు. ఉపమాక,వేంపాడు జానకయ్యపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, మహిళలు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ ,హిందూధర్మప్రచార పరిషత్ వారు ఏర్పాటు చేసిన అన్నమాచార్యకీర్తనలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కల్యాణానికి రాలేని భక్తులు సెలవుదినాల్లోను, పౌర్ణమినాడు స్వామివారిని దర్శించుకుంటారు. కాకినాడ జిల్లా దుగ్గాడకు చెందిన శంకర్‌అనే భక్తుడు సుమారు 5 వేలమందికి స్థానికుల సాయంతో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు.

వెంకన్నను దర్శించుకున్న డీఈవో

జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ ఆదివారం ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆమె గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సందడి చేసిన సాధువు

ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఓ సాధువు సందడి చేశారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఆ సాధువు శరీరమంతా విభూతి రాసుకుని, మెడలో రుద్రాక్ష మాలలు ధరించి ఆలయాని వచ్చి, కొంతసేపు శంఖం ఊదడంతో అక్కడకు వచ్చిన వారంతా వింతగా చూశారు. సాధువు వద్ద ఆండ్రాయిడ్‌ఫోన్, ఇయర్‌ఫోన్స్‌కూడా ఉండటం విశేషం.

అమావాస్య సందడి



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్లకు ఆదివారం సన్నాహాలు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి అమ్మవారి గరగలను పుర వీధుల్లో ఊరేగించేందుకు సర్వం సిద్ధం చేశారు. తెలుగు సంవత్సరాదికి 15 రోజులకు ముందుగానే అమ్మవారి గుడితలుపులు తెరవడం ఆనవాయితీగా వస్తోంది. గరగలను తొలుత గ్రామదేవత పుట్టిల్లు అయిన విక్రమంతి వారి ఇంటికి తీసుకొని వెళతారు. విక్రమంతి వంశీకులు అమ్మవారిని తమ ఇంటికి ఆహ్వానించి పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి ధీపదూపాలతో పూజలు చేస్తారు. అనంతరం గరగలు గ్రామంలో ఊరేగిస్తారు. ఈ అమ్మవారికి దాదాపు వందేళ్ల చరిత్ర ఉంది. గిరిజన సంప్రదాయం, ఆచారాల్లో భాగంగా రాజవొమ్మంగిలో అన్ని వర్గాల ప్రజల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగతాయి.



ఆలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పొలిమేర్ల కట్టడి

అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా స్థానిక గిరిజన కుటుంబాల వారు ఆదివారం గుడికి వెళ్లి పరిసరాలను శుభ్రపరచారు. ఊరి శివార్లకు వెళ్లి పొలిమేరలు కట్టారు. గ్రామం నుంచి ఎవరూ బయటకు వెళ్లొద్దని దండోరా వేశారు. గుడి తలపులు తెరిచిన నేపథ్యంలో గ్రామస్తులు ఎవరూ అడవి పనులు, పొలం పనులు, ఇతర ఏ పనులు చేపట్టవద్దని గుడి ఆసాదులు తెలిపారు.

జీఐఎస్ సూపర్‌సక్సెస్

- పారిశ్రామిక దిగ్గజాలందరినీ ఒకే వేదిక మీదుకు తెచ్చిన ఘనత సీఎం జగన్‌దే
- రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు సాధారణ విషయం కాదు
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

నక్కపల్లి: విశాఖలో ఈనెల 3, 4 తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అయిందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేశంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలందరినీ ఒకే వేదిక మీదకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆదివారం ఆయన నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మిట్ రాష్ట్ర చరిత్రను తిరగరాసిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దిగ్గజపారిశ్రామిక వేత్తలను రాష్ట్రానికి తీసుకు వచ్చి ఆయా రంగాల్లో వేలకోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆయా పారిశ్రామిక వేత్తలు అంగీకారం తెలిపారని చెప్పారు.దీని వల్ల సుమారు 6లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ పెట్టుబడుదారుల సదస్సు ద్వారా తన సత్తా ఏంటో జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి రుజువు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా వందల కోట్ల ప్రజాధనాన్ని వృధాచేసి పారిశ్రామిక టూర్లు, పెట్టుబడుల యాత్రపేరుతో విదేశీ పర్యటనలు చేయలేదని తెలిపారు.దావోస్ వెళ్లలేదని విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు జగన్ తగిన జవాబు చెప్పారన్నారు.ఎక్కడకు వెళ్లామన్నది ముఖ్యం కాదని ఎన్ని పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నామన్నదే ముఖ్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏదీ చెప్పరని, చేసి చూపిస్తారన్నదానికి ఈ సదస్సే నిదర్శనమని తెలిపారు. అంబానీ, ఆదానీ, వంటి పారిశ్రామిక వేత్తలు ఇలాంటి సదస్సుల్లో పాల్గొనడం చాలా అరుదుగా జరుగుతుందని చెప్పారు. త్వరలో విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభమవుతుందని, విశాఖ తమ రాజధాని అని జీఐఎస్ సదస్సు సాక్షిగా సీఎం చేసిన ప్రకటన ప్రజలకు ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీలు మంత్రిని దుశ్శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసకువచ్చారు. మంత్రిని కలిసిన వారిలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు సురేష్ వర్మ, భార్గవ్, ఎంపీటీసీలు గొర్లగోవిందు,గంటా తిరుపతిరావు,ఉపసర్పంచ్ వీసం రాజు,నాయకులు అల్లాడ కొండ, ఎల్లేటి సత్తిబాబు, వెదుళ్ల పాపారావు ఉన్నారు.

నూకాంబికకు వెండి కిరీటం



అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం

ఎస్.రాయవరం: కొరుప్రోలులో నూకాంబిక అమ్మవారికి 2.7 కిలోల వెండి కిరీటాన్ని ఆదివారం గ్రామానికి చెందిన ఇందుకూరి బంగారమ్మ కుటుంబ సభ్యులు అందజేశారు. దీని విలువ రూ.2.46 లక్షలని దేవదాయశాఖ ఈవో మురళీకృష్ణ తెలిపారు. ఆ కిరీటాన్ని గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు సమక్షంలో అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొరపాటి గోపాలం,గ్రామ పెద్దలు కొంగర రాజు,కొంగర రాజు, ప్రత్తిపాటి సత్యనారాయణ, బత్తిన కన్నారావు,మాజీ ఎంపీటీసీ చేకూరి వరహాలరాజు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్‌భార్గవ్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రజిత్ భార్గవ్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్‌భార్గవ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు.

నాగేంద్ర హత్య కేసులో దర్యాప్తు వేగవంతం చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న దళిత సంఘ నాయకులు



సంఘీభావం తెలుపుతున్న దళిత నాయకులు

పాయకరావుపేట : పీఎల్ పురం గ్రామంలో దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్రను హత్య చేసిన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని, లేకుంటే ఈ నెల 11 న మహా ధర్నా నిర్వహించడం జరుగుతుందని దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. పట్టణంలో గల అంబేద్కర్ పార్కులో ఆదివారం రౌండు టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు తంతడి కిరణ్ కుమార్, భీమ్‌సేన అధ్యక్షుడు రవి సిద్దార్థ మాట్లాడుతూ దళిత యువకుడైన వడ్లమూరి వీరనాగేంద్రను అతి కిరాతకంగా హత్య చేసి, కాళ్ళు, చేతులు తాళ్ళతో కట్టేసి బావిలో పడేసారన్నారు. నాగేంద్ర హత్యకు కారకులైన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలన్నారు. నాగేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. లేకుంటే ఈ నెల 11వ తేదీన మహాధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

హత్యకు గురైన దళిత యువకుడి కుటుంబానికి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ అన్నారు. నాగేంద్ర హత్య కేసులో దర్యాప్తు వేగవంతం చేయాలని, హంతకులను వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు అరుగుల మోసే ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల యూనియన్ నాయకులు బద్ద నర్సింగరావు, దళిత సంఘాల నాయకులు నెలపర్తి అర్జున్, బోడపాటి శ్రీను, రెల్లి సంఘాల నాయకులు సత్తిబాబు, కుమార్, లక్ష్మణ్, బయ్య నానాజీ, నానాజీ, సూరిబాబు, ప్రసాద్, లోవరాజు, కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

- ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

కొయ్యూరు: తాటిమానిపాలెం అగ్నిబాధితులకు అండగా ఉంటామని ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు హామీ ఇచ్చారు. ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ఆయన ఆదివారం పరామర్శించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పరంగా సాయం అందించాలని కోరారు. బాధితులు ధైర్యంగా ఉండాలని కోరారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులున్నా తమను సంప్రదించాలని సూచించారు. పాడేరు మండల కేంద్రంలో ఉంటున్నామని అతను ఉంటున్న చిరునామాను తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఉద్యోగస్తుల సేవా సంఘంతో కలిసి వసూలు చేసిన రూ.89 వేలను అందజేశారు. సర్పంచ్ చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ Ready to Occupy, 2 BHK 5th Floor, 1150 Sft, North facing with fully Furnished Deluxe Flat with Car parking, 6 yrs. Old, Akkayyapalem, 80 Ft Rd. Ramachandra Nagar. Ph : 93919 56902, 87909 63867 [V- 10255]

■ 1100 sft. West flats : Parking + Lift @ Gruhajyothi VUDA, Rajiv Nagar, Kurmannapalem. Ph : 91103 84365, 96667 15373 [V- 6090]

PLOT FOR SALE

■ కొత్తవలస జంక్షన్‌కు దగ్గరలో ఫుల్లీ డెవలప్డ్ 266 ఎకరాల ఉడా అప్రూవ్డ్ "కోహినూర్ హిల్స్" లే అవుట్‌లో అన్ని సైజుల్లో Plots కలవు. సరసమైన ధర. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 96523 30845 [V-2604]

■ కేవలం 35 లక్షలకే VZM లోకల్ పుడా స్థలంలో ఇల్లు 2BHK, 1200 చ॥అ॥ 150,167,180, 200 గజాలలో, సకల సదుపాయాలతో బ్యాంక్‌లోన్ కలదు. contact: Vzm 8074238718, Vsp 9441004439, Srklm 94929 28854 [S-1201656]

■ ప్రముఖ వాటర్ ప్యూరిఫైయర్ సంస్థలో మార్కెటింగ్ చేయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు కాలెను. జీతం : 30K. ఫోన్ : 79897 36700, 96188 04609 [V- 775208]

■ ఉచిత నైపుణ్యం Cartification కోర్సులకు దరఖాస్తులు. Fire & Safety, Industrial Welding / Fitter, Fabricator కోర్సులో, 10th to డిగ్రీ వరకు విద్యార్హత పాటు ఉద్యోగం కల్పించబడును. ఫోన్: 91548 04272, 85559 29179, 90595 36243 [V-775212]

■ Artech సంస్థలో (15,000 to 20,000) పనిచేయుటకు వయసు : 18 to 28 లోపు (Un Married) యువతీ యువకులు కావలెను. (10th, ఇంటర్, ITI, DiP, PG) ఉచిత వసతి. ఫోన్: 99660 80111, 93905 28568 [V- 2557]

■ వైజాగ్ సాగర్‌నగర్ దగ్గర హస్పిటల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 18 వేలు వరకు. 26 రోజులు డ్యూటీ. ఫోన్: 88858 68111, 97051 56111 [V- 1768]

■ Wanted 1.Marketing Incharges, 2.Counsellor, 3.Cashier, 4.Female Tele Callers. Salary: 9000/- to 25,000/- Any Degree. Age: 22 to 40, Job Location: Vizag & Gajuwaka. Contact: 8008556073, 8008557071 [G-4035]

■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం. జీతం: 18k ఏజెంట్ కమీషన్ 3k ఫోన్: 9640258899, 9640468899 [H-786842]

www.sakshi.com

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 4132]

Wanted

■ మా సంస్థలో వైజాగ్ రాయ్‌నగర్‌లో సెక్యూరిటీ గార్డులు 25 మంది, 45 సం॥లోపు వారు కావలెను. Qly: 10th, 12 గం. డ్యూటీ, జీతం: 14,700/- వీక్లీ ఆఫ్, ఉచిత భోజనం. సంప్ర॥ ✆ 70939 31732, 63091 17778 [B-1193821]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781923]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

జీడిమామిడి తోటలు దగ్ధం

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ పందిరిమామిడి సుమారు 4 ఎకరాల జీడిమామడితోట శనివారం సాయింత్రం దగ్ధం కావడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో గ్రామానికి చెందిన యూ.మల్లన్న, సీహెచ్.కన్నయ్య, సీహెచ్.భీమన్న, జీ.కన్నమ్మలకు చెందిన ఒక్కో ఎకరం జీడితోట దగ్ధమవ్వడంతో బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించి హారతులు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ సేవని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంప జేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మహిళా సాంస్కృతిక నాట్య వైభవం

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): ఖండాంతరాలకు చెందిన మహిళలు మన సంప్రదాయ నృత్యాలను అవలీలగా ప్రదర్శించి అబ్బురపరిచారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా కల్చరల్ అండ్ ఆర్ట్స్ ప్రమోషన్ సొసైటీ(క్యాప్స్)ని రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన తొలి ప్రదర్శనను రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, విజయనిర్మాణ్ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్, క్యాప్స్ సంస్థ అధ్యక్షురాలు ఎస్.విజయలక్ష్మి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నర్తకి డాక్టర్ కిరణ్మయి బోనాల, కర్ణాటకకు చెందిన భరతనాట్య కళాకారిణి ఉమామహేశ్వరి, అసోంకు చెందిన సత్రియ నాట్యకారిణి డాక్టర్ మోనీషాదేవి గోస్వామి, హాంగ్‌కాంగ్‌కు చెందిన రూపాకిరణ్ భరతనాట్యంతో ఆకట్టుకున్నారు. విశాఖకు చెందిన సంతోషి విజయ, ఆదిత్యాశ్రీ, అరుణా పరమేష్, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌కు చెందిన రేష్మి పథియాత్ ఈ పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ నాట్య గురువు బత్తిన విక్రమ్‌గౌడ్ పర్యవేక్షణలో ఈ వేడుకగా సాగింది.

ద్విచక్ర వాహనం ఢీకొని లారీడ్రైవర్‌కు గాయాలు

యలమంచిలి: రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదం ఆదివారం రాత్రి మండలంలోని లక్కవరం కూడలి వద్ద జరిగింది. కాకినాడ నుంచి పెందుర్తి వెళుతున్న లారీ డ్రైవర్ చింతల గోవింద్ భోజనం చేయడానికి 16 వ నెంబరు జాతీయ రహదారిపై లక్కవరం వద్ద వాహనాన్ని ఆపి రోడ్డు అవతల ఉన్న హోటల్‌కు వెళ్తుండగా పులపర్తి నుంచి యలమంచిలి వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన గోవింద్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గోవింద్‌కు కుడికాలు విరిగిపోయింది. ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడపడమే ప్రమాదానికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు ప్రమాద సమాచారాన్ని పోలీసులకు తెలిపారు.

వైభవంగా అనంతుని తెప్పోత్సవం



పుష్కరిణిలో నిర్వహిస్తున్న అనంతుని తెప్పోత్సవం

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 70 ఏళ్ల తరువాత ఈ ఉత్సవాన్ని నిర్వహించడంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. కుంతీ మాధవస్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను రాత్రి 8 గంటలకు పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో అర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న అనంతుని పుష్కరణి వద్దకు తీసుకువచ్చారు. విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాలను హంస వాహనంలో ఆశీనులు కావింపజేశారు. తెప్పోత్సవాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెల్లిమర్ల శ్రీదుర్గ మహా పీఠం ఉత్తర పీఠాధిపతులు శ్రవణానంద చైతన్య చినస్వామి ప్రారంభించారు. స్థానిక జాలర్లు తాళ్లతో లాగగా హంసవాహనం పుష్కరిణిలో ముందుకు సాగింది. భక్తుల పద్మనాభుని నామస్మరణాల మధ్య తెప్పోత్సవం ఉత్సాహంగా సాగింది. పరిసర ప్రాంత గ్రామాల నుంచే కాకుండా సింహాచలం, విజయనగరం, తగరపువలస నుంచి వచ్చిన భక్తులతో అనంతుని పుష్కరిణి జన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా కోలాటం, శక్తి డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, ఈవో ఎస్.నానాజీ బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపే అప్పన్నకు పెళ్లిచూపులు

- కొండ దిగువ ఉద్యానవన మండపంలో డోలోత్సవం

సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. స్వామి పెళ్లి కుమారుడిగా ముస్తాబై.. సింహగిరి నుంచి కొండ దిగువకు విచ్చేయనున్నారు. అక్కడ పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపంలో అధిష్టించి డోలోత్సవం నిర్వహించుకుంటారు. పెళ్లి నిశ్చయం అయిన ఆనందంతో అడవివరంలో తిరువీధి జరుపుకోనున్నారు.

ఉత్సవం నిర్వహణ ఇలా...


శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకీలో ఉంచి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో సింహగిరి నుంచి కొండ దిగువకు మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. అక్కడి నుంచి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి తిరువీధిగా తీసుకెళ్తారు. తదుపరి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపానికి తీసుకెళ్లి స్వామిని డోలీలో అధిష్టింపజేస్తారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, డోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం అడవివరంలో తిరువీధి ఉత్సవం జరుగుతుంది. మరలా పైడితల్లి ఆలయం వద్దకు స్వామిని తీసుకెళ్లి అక్కడి నుంచి తిరిగి మెట్లమార్గంలో కొండపైకి చేర్చుతారు. డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో వైదికులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యానవన మండపాన్ని విశేషంగా ముస్తాబు చేస్తున్నారు.

డోలోత్సవం వెనుక కథ ఇదీ..

డోలోత్సవం నిర్వహణ వెనుక అనాదిగా ఓ కథ ప్రచారంలో ఉంది. సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజున ఎంతో వైభవంగా వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తారు. చైత్ర శుద్ధ ఏకాదశికి ముందు వచ్చే ఫాల్గుణ పౌర్ణమి రోజున స్వామికి పెళ్లి చూపుల సంప్రదాయంతో డోలోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అడవివరం గ్రామ సంప్రదాయం ప్రకారం దీనిని బొట్టినడిగే పున్నమిగా పిలుస్తారు. అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోదరిగా అభివర్ణిస్తారు. పైడితల్లి అమ్మవారి కుమార్తెనే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి పెళ్లి చేసుకున్నారని విశ్వసిస్తారు. అందుకే ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున తనకు పిల్లనివ్వమని సింహగిరి నుంచి కొండదిగువకు స్వామి వస్తారని, పెళ్లి కుదిరిన ఆనందంలో డోలోత్సవం నిర్వహించుకుంటారని గ్రామస్తులు భావిస్తారు. ఈ క్రమంలోనే సింహగిరిపై నుంచి కొండ దిగువకు వచ్చిన స్వామి తొలుత తన సోదరి అయిన పైడితల్లి ఆలయం వద్దకు వెళ్లి తనకు పిల్లనివ్వమని అడుగుతారు. 'నీకు ఆస్తిపాస్తులు ఏం ఉన్నాయని.. ఏం చూసి పిల్లనివ్వాలని' తొలుత పైడితల్లి ఒప్పుకోదు. దీంతో స్వామి అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవనమండపంలో అధిష్టిస్తాడు. అక్కడ ఎంతో వైభవంగా డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం జరుపుకుంటారు. ఈ వేడుక విషయాన్ని తెలుసుకున్న పైడితల్లి అమ్మవారు స్వామికి ఎంతో మంది భక్తులు ఉన్నారని, వారే ఆయన ఆస్తి అని తెలుసుకుని పిల్లనివ్వడానికి ఒప్పుకుంటుంది. పిల్లనిస్తానని స్వామిని ఆహ్వానిస్తుంది. స్వామికి పెళ్లి నిశ్చయమైన ఆనందంతో గ్రామస్తులు, భక్తులు, దేవస్థానం ఉద్యోగులు, వైదికులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని వసంతోత్సవం జరుపుకుంటారు. ఈ కార్యక్రమాన్నే డోలోత్సవంగా అభివర్ణిస్తారు. డోలోత్సవం అనంతరం ఉగాది రోజున పెళ్లిరాట, చైత్రశుద్ధ ఏకాదశి రోజున వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



డోలోత్సవం జరిగే కొండదిగువ ఉద్యానవన మండపం



అడవివరం గ్రామ దేవత, స్వామి సోదరి పైడితల్లి అమ్మవారు